క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలోని పలు కాలనీల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా 11కేవీ గొల్లగూడ ఫీడర్‌లో గల మిర్యాలగూడ రోడ్డు, దారుపాష కాలనీ, గొల్లగూడ, పెద్దబండ, బీటీఎస్, దుర్గా కాలనీ, కలెక్టరేట్, ఫారెస్టు ఆఫీస్ రోడ్డు, కేశరాజుపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

నేత్రాల సేకరణ

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణానికి చెందిన కొండా సుశీల మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యుల అనుమతితో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్ట్ వారు మంగళవారం సుశీల నేత్రాలను సేకరించారని ట్రస్ట్ చైర్మన్ కేవీ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ దామెర యాదయ్య, డాక్టర్ రాజిరెడ్డి, డాక్టర్ సీహెచ్.పుల్లారావు, కోఆర్డినేటర్ సీహెచ్.చంద్రశేఖర్, డాక్టర్ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు

నకిరేకల్: మండలంలోని తాటికల్ శివారులో గల లయన్స్ వృద్ధాశ్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం వృద్ధులకు దుస్తులు, పండ్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ వృద్ధాశ్రమ అధ్యక్షుడు రాంమోహన్‌రావు, గార్లపాటి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

నకిరేకల్: ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసాకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని నకిరేకల్ వ్యవసాయ డివిజన్ కార్యాలయ ఇన్‌చార్జ్ ఏడీఏ ఎండీ జానిమియా మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వానాకాలం–2025 పథకానికిగాను నకిరేకల్ వ్యవసాయ డివిజన్ పరిధిలో ఈ నెల 5వ తేదీ నాటికి కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన 1627 మంది రైతులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రైతు భరోసా కోసం ఈ నెల 20వ తేదీ చివరి గడువు విధించినట్లు పేర్కొన్నారు.

కేతేపల్లి ఎస్‌ఐగా సతీష్



కేతేపల్లి: కేతేపల్లి ఎస్‌ఐగా యు.సతీష్ నియమితులయ్యారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎ.శివతేజ నల్లగొండ వీఆర్‌కు బదిలీ అయ్యారు. నల్లగొండ వీఆర్‌లో ఉన్న సతీష్‌ను కేతేపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ జిల్లా పోలీసు ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నూతన ఎస్‌ఐ సతీష్ బుధవారం బాధ్యతల స్వీకరించనున్నారని తెలిసింది.

వసతి గృహాలను సద్వినియోగం చేసుకోండి

నల్లగొండ టౌన్: నల్లగొండలో విశ్వబ్రాహ్మణ బాలుర విద్యార్థి వసతి గృహాలను సద్వినియోగం చేసుకోవాలని విశ్వబ్రాహ్మణ విద్యార్థి వసతి గృహ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు కూరెల్ల రమణాచారి ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండతో పాటు పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ వసతి గృహంలో ఉండి చదువుకోవచ్చన్నారు.

19న పాలస్తీనా సంఘీభావ దినం

నల్లగొండ టౌన్ : జిల్లా వ్యాప్తంగా అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో ఈ నెల 19న పాలస్తీనా సంఘీభావ దినంగా పాటిస్తూ నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ప్రజాస్వామిక లౌకిక శక్తులు, వామపక్షాలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



పుస్తకాలు పంపిణీ చేస్తున్న గుత్త మంజుల

కేతేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుత్త మంజులమాధవరెడ్డి అన్నారు. మంగళవారం కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో గల మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఆమె పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యతోపాటు మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మమత, ఉపాధ్యాయులు కర్ణాకర్‌రెడ్డి, రఫి, నగేష్, లావణ్య, సునీత, బిందు, అలేఖ్య పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరేనా !

- గత ప్రభుత్వ హయాంలో నిర్మాణ పనులు ప్రారంభం
- నేటికీ పూర్తి కాని డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- ఇళ్ల కోసం పేద ప్రజల ఎదురుచూపులు



తిప్పర్తి మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు

తిప్పర్తి : ఇళ్లు లేని పేద ప్రజలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇచ్చి వారి ఆత్మగౌరవం పెంపొందించేలా చేస్తామని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు హామీ ఇచ్చింది. ఆ హామీ మేరకు అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో 2019–2020 సంవత్సరంలో తిప్పర్తి మండల కేంద్రంలో వంద ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తిప్పర్తి మండల కేంద్రంలోని నల్లగొండ రోడ్డులో హైవే వెంట వంద ఇళ్లకు రూ.5కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించారు. కానీ ఐదు సంవత్సరాలు కావొస్తున్నప్పటికీ నేటివరకు పనులు పూర్తి కాకపోవడంతో ఇళ్లులేని పేద ప్రజల సొంతింటి కల నెరవేరకుండా పోయింది. దీంతో అర్హులు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ఎదురు చూడక తప్పడం లేదు.

75 శాతం పనులు పూర్తి

తిప్పర్తి మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు ఇప్పటి వరకు 75 శాతం పూర్తయ్యాయి. కిటికీల ఏర్పాటు, విద్యుత్, నీటి సరఫరా, దర్వాజల ఏర్పాటు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. మిగిలిన 25 శాతం పనులు పూర్తి చేసినట్లయితే వంద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతుంది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి మిగిలిన పనులు పూర్తి చేసి డబుల్ బెడ్‌రూం ఇళ్లు అర్హులైన వారందరికీ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

ఇల్లు జాగ కూడా లేదు



మేం నిరుపేదలం. ఇల్లు జాగ కూడా లేదు. ఇల్లు లేకపోవడంతో ఎంతో ఇబ్బంది పడుతున్నాం. తిప్పర్తి మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇళ్లలో మాకు ఒక ఇల్లు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి. ప్రభుత్వం మాలాంటి వారికి ఇల్లు ఇస్తే ఎంతో సంతోషిస్తాం.

–ఆదిమూల ఎల్లమ్మ, ఎస్సీ కాలనీ, తిప్పర్తి

ఇల్లు మంజూరు చేయాలి



మేము తిప్పర్తి ఎస్సీ కాలనీలో చిన్న గదిలో నివాసం ఉంటున్నాం అది కూడా మా అమ్మగారిది. నాకు సొంత ఇల్లు లేదు. కనీసం జాగా కూడా లేదు. ప్రభుత్వం మాకు డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇచ్చి ఆదుకోవాలి. మాలాంటి నిరుపేదలకు ఇల్లు ఇస్తే బాగుంటుంది.

–గార్లపాటి లక్ష్మి, ఎస్సీ కాలనీ తిప్పర్తి

75 శాతం పనులు పూర్తయ్యాయి

తిప్పర్తి మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు 75 శాతం పూర్తయ్యాయి. మిగిలిన 25 శాతం పనులు మూడు నుంచి నాలుగు నెలల్లో పూర్తి చేస్తాం

– శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈ, తిప్పర్తి

నాణ్యత లోపిస్తే సహించేది లేదు

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

మునుగోడు: నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్ల పనుల్లో నాణ్యత లోపం కనిపిస్తే సహించేది లేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా కొనసాగుతున్న 57 నూతన బీటీ రోడ్లు కచ్చితంగా 5.5 మీటర్ల వెడల్పుతో నిర్మించాలని సూచించారు. పనులు జరిగే సమయంలో అధికారులు అక్కడే ఉండి నిబంధనల ప్రకారం చేయించాలన్నారు. పలు ప్రధాన గ్రామాల రోడ్లు ఎంతవరకు చేపట్టారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్, డీఈ నాగేశ్వరావు, ఏఈ సతీష్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవు



రోడ్డుపై డబ్బాలు, తోపుడు బండ్లను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

మునుగోడు: ప్రధాన రహదారులకు ఇరువైపులా పండ్ల బండ్లు, డబ్బాలు ఏర్పాటు చేసుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని ఎంపీడీఓ విజయ భాస్కర్ హెచ్చరించారు. మంగళవారం మునుగోడు మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న పలు డబ్బాలు, పండ్ల బండ్లను గ్రామ పంచాయతీ సిబ్బందితో తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రోడ్లు ఇరుకుగా ఉంటే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, వాటిని నివారించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

వాగ్వాదానికి దిగిన చిరు వ్యాపారులు..

అధికారులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న బండ్లను, డబ్బాలను తొలగించే సమయంలో పలువురు చిరు వ్యాపారులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. అధికారులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న అందరి బండ్లను తొలగించకుండా కొందరివి మాత్రమే తొలగించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరి డబ్బాలు తొలగించి మరికొందరిని ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించారు. అయినా అధికారులు వారిని పట్టించుకోకుండా పోలీసుల సహాయంతో కొందరి డబ్బాలను గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో తీసుకెళ్లి మరొచోటకు మార్చారు. అనంతరం వ్యాపారులు తిరిగి తీసుకొచ్చుకొని యథావిధిగా పెట్టుకున్నారు.

లయన్స్ క్లబ్ సేవలను విస్తరించాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నూతన కమిటీని అభినందిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: లయన్స్ క్లబ్ సేవలను నకిరేకల్ నియోజకవర్గంలో మరింత విస్తరించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లో 2025–26 సంవత్సరానికిగాను నూతనంగా ఎన్నికైన లయన్ క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్, ఇతర కార్యవర్గాన్ని మంగళవారం ఆయన అభినందించి మాట్లాడారు. నకిరేకల్ పట్టణంలో లయన్ క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, క్లబ్ అధ్యక్షుడు ప్రకాష్‌రావు, డిస్ట్రిక్ చైర్మన్లు ఎర్ర శంభులింగారెడ్డి, రాంమోహన్‌రావు, ప్రతినిధులు సూర్యకుమార్, ఎల్లపురెడ్డి యాదగిరిరెడ్డి, సూర్యచంద్రరావు, తక్కలపల్లి ప్రభాకర్‌రావు, కందాల నారాయణరెడ్డి, వరకాంతం నారాయణరెడ్డి, గుండ్లపల్లి నారాయణ, బెలిదె యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు

నల్లగొండ టూటౌన్: విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం డీఈఓ భిక్షపతికి బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ అనుమతులు లేకుండా పాఠశాలలను నడుపుతూ అధిక ఫీజులు, పుస్తకాలు, స్కూల్ డ్రెస్‌లు, డొనేషన్‌ల పేరుతో విద్యార్థులను దోచుకుంటున్నారని, ఆ పాఠశాలలను సీజ్ చేయాలని విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం నాయకులు బొమ్మరబోయిన నాగార్జున చల్లా కోటేష్ యాదవ్, దుబ్బాక రాము, నోముల క్రాంతి కుమార్, వెంకన్న, రాజు, శివకుమార్, హరిశంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

నల్లగొండ టూటౌన్: పట్టణంలో అనుమతులు లేకుండా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న వ్యాపారులను ఏబీవీపీ నగర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అడ్డుకున్నారు. అనంతరం ప్రభుత్వ అనుమతులు లేకుండా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఛత్రపతి చౌహాన్ , సంపత్, శంకర్, శివ, గణేశ్, శివ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీకి..

తిప్పర్తి : తుర్కకాశ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాశ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే బడేసాబ్, జిల్లా అధ్యక్షుడు ఎస్కే రహీం మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. కాశ కార్మికులకు మైనార్టీ కార్పొరేషన్ ద్వారా బ్యాంకులకు సంబంధం లేకుండా రుణాలు మంజూరు చేయాలని, రాయి కొట్టే ఆధునీకరణ యంత్రాలు అందజేయాలని కోరారు.

షాపులపై దాడులు ఆపాలని అటవీ శాఖ కార్యాలయంలో..

నల్లగొండ టౌన్: కార్పెంటర్ షాపులపై అటవీ శాఖ అధికారుల దాడులు ఆపాలని కోరుతూ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, నల్లగొండ పట్టణ అధ్యక్షుడు సలివోజు సైదాచారి మంగళవారం జిల్లా అటవీ శాఖ అధికారి కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అద్దంకి నరసింహ, అవుట రవీందర్, గడగోజు సైదాచారి, బత్తినోజు సైదాచారిలు తదితరులు ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



చండూరు : మాట్లాడుతున్న అంజనేయులు

నకిరేకల్ : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి కోరారు. వికసిత్ భారత్ సంకల్ప కార్యక్రమంలో భాగంగా నకిరేకల్‌లో మంగళవారం జరిగిన బీజేపీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు గర్రె మురళీమోహన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న, చినేని జాని, గుడుగుంట్ల సాయన్న, యనాల శ్రీనివాస్‌రెడ్డి, పందాల సైదులు, బోనగిరి వెంకటేశ్వర్లు, నవీన్, నడికుడి సైదులు, సీరందాస్ ఉపేంద్ర చారి, బ్రహ్మదేవర రవిశంకర్, వేణుమాధవ్, కారింగుల యాదగిరి, విక్కి, జగదీష్, వినోద్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రధాని మోదీ లక్ష్యం

చండూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పనిచేస్తున్నారని బీజేపీ జిల్లా కార్యదర్శి చిలువేరు దుర్గయ్య, అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్ అన్నారు. మంగళవారం బంగారిగడ్డ గ్రామంలో బీజేపీ 11 ఏళ్ల సంకల్పసభ నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టిన మోదీ పేదలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ పేదలు ఆత్మగౌరవంతో బతికేలా చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు, అసెంబ్లీ కో కన్వీనర్ కాసాల జనార్దన్‌రెడ్డి, నాయకులు నకిరెకంటి లింగస్వామిగౌడ్, మురళీమనోహర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మాదగోని నాగార్జున, అన్నెపర్తి యాదగిరి, శ్రీను, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

కేతేపల్లి: పేదల సంక్షేమం కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీ కార్యకర్తలు ప్రజలకు వివరించి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు కన్వీనర్ మైల నరసింహ కోరారు. మంగళవారం సాయంత్రం కేతేపల్లిలో నిర్వహించిన బీజేపీ సంకల్ప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం బీజేపీ నాయకులు మొక్క నాటి నీళ్లు పోశారు. బీజేపీ మండల అధ్యక్షుడు పిట్టల వెంకట్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో నాయకులు కూరెళ్ళ వెంకటేశ్వర్లు, ఎ.అనిత, టి.నర్సింహాచారి, ఇరుగుదిండ్ల పద్మ, సమ్మెట విజయలక్ష్మి, గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, సమ్మెట రఘు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం



నకిరేకల్ : అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ అస్రా అంజుమ్



శాలిగౌరారం : అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ సైదులు

నకిరేకల్: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ అస్రా అంజుమ్ కోరారు. అమ్మ మాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని బాబాసాహెబ్‌గూడెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఆమె చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. . ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, వార్డు కౌన్సిలర్ కొండ శ్రీను, అంగన్‌వాడీ సిబ్బంది ఎస్కే లతీఫా పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల, వెలిమినేడు, ఆరెగూడెం, బొంగోనిచెర్వు గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతనంగా చేరిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పలువురు దాతల సహకారంతో చిన్నారులకు పలకలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, అంగన్‌వాడీ టీచర్‌లు జి.ధనమ్మ, పి.అంజమ్మ, జి.లలిత, బుచ్చమ్మ, లావణ్య, రేణుక, అండాలు, పద్మ, సునిత, ధనలక్ష్మి, నాగేంద్రమ్మ, నవనీత, కవిత, యాదమ్మ, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె.రేవతి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ కళావతి అన్నారు. కేతేపల్లి మండలంలోని తుంగతుర్తి గ్రామంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో కూడిన విద్యనందిస్తామని తెలిపారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో అశ్విత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జి.కవిత, అంగన్‌వాడీ టీచర్లు సరిత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం : మండలంలోని చిత్తలూరు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం మండలం విద్యాధికారి మందుల సైదులు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకన్న, ఉపాధ్యాయులు నర్సయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అంగన్‌వాడీ టీచర్లు శోభారాణి, లలిత, వసంత అనిత తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు: అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ లావణ్య కోరారు. అంగన్‌వాడీ బడి బాటలో భాగంగా మంగళవారం మునుగోడు మండలంలోని చీకటిమామిడి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ వెంకటమ్మ, సూపర్‌వైజర్ శిరీష, అంగన్‌వాడీ టీచర్లు విజయ శోభ తదితరులు పాల్గొన్నారు.

కనగల్: మండలంలోని దర్వేశిపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బి.శ్రీలత చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో దేవిరెడ్డి పద్మ, మేక అరుణ, బి.జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

తిప్పర్తి : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి వంట గ్యాస్, సరుకులను ప్రభుత్వమే సరఫరా చేయాలని సీఐటీయూ నాయకుడు గణేశ్ అన్నారు. మంగళవారం తిప్పర్తి మండల కేంద్రంలోని ఎమ్మార్వీ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 9 నుంచి చేపట్టనున్న సమ్మెకు సంబంధించిన నోటీసులు ఎంఈఓకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోకల శశిధర్, పోలగోని యాదమ్మ, కిన్నెర సైదమ్మ, రూతమ్మ, వెంకటమ్మ, నాగమ్మ, కళమ్మ మధ్యాహ్న భోజన కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

రామగిరి (నల్లగొండ): ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ 4వ రాష్ట్ర మహాసభలు జూన్ 21, 22 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్నట్లు ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కోశాధికారి కేఎస్ రెడ్డి, డిపో గౌరవాధ్యక్షుడు దండెంపల్లి సత్తయ్య తెలిపారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట మహాసభల పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులు మహాసభలకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కందుల నరసింహ, ఎంసీ మౌళి, గద్దర్ నరసింహ, యాదగిరి, శంకరయ్య, వెంకన్న ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

మర్రిగూడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. మంగళవారం మర్రిగూడ మండలంలోని తిరగండ్లపల్లి గ్రామంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నీలకంఠం రాములు, కొట్టం యాదయ్య, చెల్లం ముత్యాలు, సల్వోజు రామలింగాచారి, దామెర లక్ష్మి, అయిలి కృష్ణయ్య, ఏరుకొండ రాఘవేంద్ర, యాదమ్మ, విజయలక్ష్మి, అంజయ్య పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళన

నల్లగొండ టౌన్: పట్టణంలోని ఏకశిల పాఠశాల ఆవరణలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకు వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని మంగళవారం నల్లగొండలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ ఏకశిల పాఠశాలను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎంఎ.సైఫ్, మారుపాక కిరణ్, మహేష్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

చిట్యాల: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య ఆధ్వర్యంలో చిట్యాలలో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను పట్టుకుని హతమారుస్తూ మారణ హోమం సృష్టిస్తోందన్నారు. ప్రధానమంత్రి మోదీ, హోం శాఖ మంత్రి అమిత్‌షా నియంతల్లా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, ఐతరాజు నర్సింహ, బొబ్బలి సుధాకర్‌రెడ్డి, గుడిసె లక్ష్మీనారాయణ, జిట్ట స్వామి, కోనేటి రాములు, వెంకన్న, ఇద్దయ్య, చంద్రమౌళి, లింగయ్య, నర్సింహ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నల్లగొండ టూటౌన్: పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమమే ధ్యేయమని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ అన్నారు. మంగళవారం నల్లగొండలోని దేవరకొండ రోడ్‌లో సంజీవిని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దాదాపు 300 మంది పారిశుద్ధ్య కార్మికులకు డాక్టర్ హనుమంత్ మాలి ఆధ్వర్యంలో బీపీ షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, గడ్డం శ్రీనివాస్, ప్రదీప్ రెడ్డి, జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

కేతేపల్లి: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అశ్విత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జి.కవిత కోరారు. బాల్య వివాహాల నిర్మూలనపై అశ్విత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కేతేపల్లి మండలంలోని తుంగతుర్తి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కవిత మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం, 18 సంవత్సరాలలోపు పిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు చేయడం వల్ల పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అనంతరం బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థల నిర్మూలనపై రూపొందించిన వాల్ పోస్టర్లను ఉపాధి కూలీలతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాణి, ఫీల్డ్ అసిస్టెంట్ జటంగి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జెండా ఆవిష్కరణ

మునుగోడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుర్జ రామచంద్రం కోరారు. మునుగోడు మండలంలోని కొంపల్లి గ్రామంలో మంగళవారం సీపీఐ జెండాను ఆయన ఎగురవేసి మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి చాపల శ్రీను, నాయకులు బి. లాలు, చలపతి, కైలాస్, శంకర్, దశరథ, వి. వెంకటేశ్వరావు, యాదయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ విద్యార్థినికి నీట్‌లో 100వ ర్యాంక్



ప్రియాంకను అభినందిస్తున్న డీఐఈఓ దస్రూనాయక్

నల్లగొండ: ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో నల్లగొండ పట్టణం చర్లపల్లిలోని ఎస్ఆర్ కళాశాల విద్యార్థిని బచ్చు ప్రియాంక ఆలిండియా స్థాయిలో 100వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రియాంకను మంగళవారం డీఐఈఓ దస్రూనాయక్ అభినందించారు. ప్రియాంకతోపాటు మెడిసిన్ ర్యాంక్ సాధించిన పావని, లేఖన, ప్రవల్లిక, జ్యోతి, గాయత్రి, దివ్య ధరణిలను, వారి తల్లిదండ్రులను డీఐఈఓ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ దోనాల శ్రీనివాస్‌రెడ్డి ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఏనగందుల వరదారెడ్డి, డైరెక్టర్ సంతోశ్‌రెడ్డి, సీఈఓ సురేందర్‌రెడ్డి, నల్లగొండ బ్రాంచ్ అసిస్టెంట్ జోనల్ సతీశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మనోజ్ రెడ్డి, డీన్ కిశోర్ బాబు, ఏఓ సరితారెడ్డి, అధ్యాపకులు వర్ధన్, ప్రసన్న, శ్రీనివాస్, శోభ పాల్గొన్నారు.